## ఆటో డ్రైవర్ల సమస్యలపై ఏఐటీయూసీ ఆందోళన

- ఆర్టీఏ కార్యాలయం ఎదుట ధర్నా.. పలు డిమాండ్లతో వినతిపత్రం
- రూ.12 వేల సాయం విడుదలతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి




భద్రాద్రి కొత్తగూడెం / అశ్వరావుపేట / జూలై 28 / అక్షరం న్యూస్ :-ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ మోటార్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం అశ్వరావుపేట ఆర్టీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ ఆటో అండ్ ప్రైవేట్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా చేపట్టిన ఈ ఆందోళనలో పాల్గొన్న నాయకులు అనంతరం అధికారులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఆటో డ్రైవర్లకు ప్రకటించిన రూ. 12 వేల ఆర్థిక సాయాన్ని వెంటనే విడుదల చేయాలని, ఆర్టీఏ కార్యాలయాల్లో ఆటోలకు రేడియం స్టిక్కరింగ్ నిబంధనను మినహాయించాలని, ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఓలా, ఉబర్, రాపిడో వంటి ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో ఆటోలకు ఈ-చలాన్ల విధానాన్ని రద్దు చేయాలని, సారథి--వాహన్ పోర్టల్‌లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్‌లను కొనసాగించాలని, పెరిగిన ఇంధన, నిర్వహణ వ్యయాలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను వెంటనే పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటో, ప్రైవేట్ మోటార్ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు షేక్ అబ్బాస్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గన్నిన రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యుడు పటాన్ జలాల్, మండల నాయకులు దోమల అనిల్, ముత్తు, బస్టాండ్ ఆటో సెంటర్ యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, ప్రవీణ్, వెంకన్న, మురార్జీ, రింగ్ రోడ్ సెంటర్ ఆటో యూనియన్ నాయకులు రామకృష్ణ, రాంబాబు, హరి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బాలికల హాస్టల్లో దుప్పట్లు పంపిణీ చేసిన సర్పంచ్ బిసు ధనలక్ష్మి చందర్ గౌడ



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూల 28 / : మంగళవారం రోజు ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ బిసు ధనలక్ష్మి చందర్ గౌడ్, సుబ్బారెడ్డి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అన్ని రకాల వసతులు కల్పిస్తూ, వారి విద్యాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.అనంతరం హాస్టల్‌లోని విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, వార్డు సభ్యులు బూడిద శేఖర్, బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ స్వప్న, బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ సునీల్ కుమార్, ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ ప్రసన్న, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హరిబాబు లక్ష్మీనారాయణ పెద్ద కుమారుడు ఆత్మకు శాంతి కలగాలని సంఘీభావ ర్యాలీ.



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూల 28 / : యా దాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో బిజెపి గ్రామ శాఖ ఉపాధ్యక్షులు కళ్లెం హరిబాబు లక్ష్మీనారాయణ పెద్ద కుమారుడు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మరణించడం జరిగింది. సైదాపురం గ్రామం నుండి మాసాయిపేట వరకు ఆత్మకు శాంతి కలగాలని సంఘీభావ ర్యాలీ తీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండలాధ్యక్షులు కళ్లెం శ్రీనివాస్ గౌడ్ , బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు మండల నాయకులు , గ్రామ పెద్దలు స్నేహితులు తదితరులు ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనడం జరిగింది.

## ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి జూలై 30న వాక్-ఇన్ ఇంటర్వ్యూ...

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్

ఖమ్మం జిల్లా /ఖమ్మం టౌన్ జూలై 28( అక్షరం న్యూస్)

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖమ్మంలో ఔట్సోర్సింగ్ విధానంలో ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ కోసం జూలై 30న ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖమ్మంలోని మెడికల్ సూపరింటెండెంట్ ఛాంబర్ లో వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిప్లొమా ఇన్ ఫార్మసీ (డి.ఫార్మసీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బి.ఫార్మసీ) అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన విద్యార్హతల సర్టిఫికెట్లతో నిర్ణీత సమయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జైపాల్ రెడ్డి 7 వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన ధరావత్ వెంకన్న నాయక్



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూల 28 / : హైదరాబాద్ కేంద్ర మాజీ మంత్రి వర్యులు, అత్యుత్తమ పార్లమెంట్ సభ్యులు అవార్డ్ గ్రహీత, స్వర్గీయ శ్రీ సూదిని జైపాల్ రెడ్డి 7 వ వర్ధంతి సందర్భంగా వారి స్మారక స్ఫూర్తి స్థలంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారికి ఘన నివాళులు అర్పించిన టి పి సి సి అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్న నాయక్, ఇట్టి కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ నిర్లక్ష్యంతో నీటి వృథా -- వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల విజ్ఞప్తి.





యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూల 28 / : మంగళవారం రోజు మోట కొండూరు మండల కేంద్రంలో గ్రామ బస్టాండ్ వెనకాల పాల సెంటర్ వద్ద గ్రామ పంచాయతీ తాగునీటి పైప్‌లైన్ నుంచి నీరు నిరంతరం లీక్ అవుతూ రోడ్డుపై వృథాగా పారుతోంది.దీంతో విలువైన తాగునీరు వృథా కావడంతో పాటు రోడ్డంతా బురదగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో వర్షాలు లేక సాగు నీరు లేక రైతులు ఇబ్బంది పడుతుంటే,ఉన్న త్రాగు నీరైన ప్రజలకు అందుబాటులో ఉండాలని చూస్తుంటే , వృధాగా పోతున్న నీరుతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ,త్రాగునీరు కూడా ఇలా రోడ్డుపై వృధాగా పోతున్న కూడా పట్టించుకోకుండా మాకే సంబంధం లేనట్టు అధికారులు వ్యవహరిస్తురని గ్రామస్తులు వాపోతున్నారు. అస్థానికులు పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి లీకేజీ కారణంగా రహదారి దెబ్బతినే ప్రమాదం కూడా ఉందని వారు చెబుతున్నారు.తాగునీటిని ఆదా చేయాల్సిన సమయంలో ఇలా నీరు వృథా కావడం బాధాకరమని గ్రామస్థులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీని మరమ్మతు చేసి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ నీటి పైప్‌లైన్ లీకేజీతో రోడ్డుపై వృథాగా పారుతున్న నీటిని పరిశీలిస్తున్న తెలంగాణ రక్షణ సేన భవన మరియు ఇతర నిర్మాణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి గణేష్ మరియు స్థానికులు.

## ట్రోల్స్‌ను అస్సలు పట్టించుకోవద్దు

### అభిమానులకు అల్లు అర్జున్ సూచన

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమ య్యారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ శౌర్య భవన్‌లో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 600 మందికి పైగా అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అల్లు అర్జున్, సోషల్ మీడియాలో నిత్యం ఎదురయ్యే అనవసరపు ట్రోల్స్, నెగెటివిటీపై తీవ్రంగా స్పందించారు. నెట్టింట జరిగే దుష్ప్రచారాలను, అనవసర వివాదాలను అస్సలు పట్టించుకోవద్దని, వాటికి ఎలాంటి స్పందన ఇవ్వకుండా సంయమనం పాటించాలని తన అభిమానులకు ఆయన హితవు పలికారు. అభిమానులందరూ సానుకూల ధోరణితో ముందుకు సాగాలని, తమ సమయాన్ని, శక్తిని మంచి పనులకే వెచ్చించాలని బన్నీ ఈ వేదికగా సందేశమిచ్చారు. అభిమానుల ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, వారితో కలిసి ఫోటోలు దిగుతూ సందడి చేశారు. సినిమాల విషయానికి వస్తే.. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీతో రాకా సినిమా చేస్తున్నాడు ఈ చిత్రంలో దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా.. కళనిధి మారాన్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం అనంతరం లోకేష్ కనగరాజ్‌తో సినిమా చేయబోతున్నాడు బన్నీ.

## బట్వారా 1947 ట్రైలర్ విడుదల

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

## రిజర్వేషన్లపై తన పేరుతో తప్పుడు ప్రచారాలు

### వాటిని నమ్మవద్దని కోరిన నటి శిల్పాశెట్టి

రిజర్వేషన్ల అంశంపై తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు పూర్తిగా అబద్ధమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని నటి శిల్పా శెట్టి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తన పేరును ఉపయోగిస్తూ కొందరు కావాలని నిందలు వేస్తున్నారని, అది పూర్తిగా కల్పితమైన వార్త అని స్పష్టం చేశారు. నా పేరును ఉపయోగిస్తూ రిజర్వేషన్లపై వైరల్ అవుతున్న తప్పుడు ప్రకటనలు చూసి తీవ్ర షాక్‌కు గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దుర్బుద్ధితో కూడిన చెత్త ప్రచారం. ఇలాంటి ఫేక్ న్యూస్‌ను ఎవరూ నమ్మకండి అంటూ శిల్పా రాసుకొచ్చింది.రిజర్వేషన్ వ్యవస్థను ఉద్దేశించి వైద్యులు, కులాల ఆధారంగా రోగులకు చికిత్స చేయాలంటూ శిల్పా శెట్టి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టినట్లుగా ఒక స్క్రీన్‌షాట్ నెట్టింట తీవ్ర కలకలం రేపింది.

# ప్రతి రోగికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలి : జిల్లా కలెక్టర్ అంకిత్





- రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ.
- జ్వర కేసులు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, పరిశుభ్రతపై సమగ్ర పరిశీలన.

భద్రాద్రి కొత్తగూడెం / లక్ష్మీదేవిపల్లి / జూలై 28 / అక్షరం న్యూస్ -:

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు.తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించి పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ, వార్డులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని, రోగులు ఆసుపత్రికి వచ్చిన నాటి నుంచే ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

అనంతరం వైద్యాధికారితో మాట్లాడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదవుతున్న ఓపీ వివరాలు, రోజువారీ రోగుల సంఖ్య, గత పది రోజులుగా నమోదైన జ్వర కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జ్వరాలపై ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, జ్వర లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు నిర్వహించి తక్షణమే చికిత్స అందించాలని సూచించారు. గ్రామాల్లో జ్వరాల నివారణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను కూడా విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు.

రక్త పరీక్షల విభాగాన్ని సందర్శించిన కలెక్టర్ మలేరియా, డెంగ్యూ, హెచ్ఐవీ నిర్ధారణకు అవసరమైన టెస్టింగ్ కిట్ల లభ్యత, నిర్వహిస్తున్న రక్త పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. ప్రయోగశాలలో అవసరమైన అన్ని పరీక్షా సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని తనిఖీ చేశారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

మందుల నిల్వ గదిని సందర్శించిన జిల్లా కలెక్టర్ అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, వాటి గడువు తేదీలు, అవసరమైన మందుల లభ్యతను పరిశీలించారు. మందుల కొరత ఏర్పడకుండా ముందస్తుగా ఇండెంట్లు పంపించి అవసరమైన మందులను నిల్వ ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా పాము కాటుకు గురైన బాధితులకు అత్యవసరంగా వినియోగించే యాంటీ స్నేక్ వెనం ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుష్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు, నిల్వలో ఉన్న ఆయుష్ ఔషధాలను పరిశీలించారు. ప్రజలకు ఆయుష్ వైద్య సేవలను కూడా సమర్థవంతంగా అందించాలని సూచించారు.

తనిఖీ అనంతరం ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల అభిప్రాయాలను తెలుసుకొని వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు, పరీక్షా సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట లక్ష్మీదేవి పల్లి తాసిల్దార్ శిరీష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్యులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అటవీ--రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి జాయింట్ సర్వేను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్





- గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.
- జిల్లా స్థాయి అటవీ సంరక్షణ సమావేశంలో అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూలై 28 / అక్షరం న్యూస్ –:

జిల్లాలో అటవీ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన భూ సమస్యలను కేటగిరీల వారీగా వర్గీకరించి, అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలను ముందుగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అంశాలను ఆలస్యం చేయకుండా సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో అటవీ--రెవెన్యూ భూ సమస్యలు, పోడు భూములు, అటవీ అనుమతులు, భూ జాయింట్ సర్వే, ఆర్వోఎఫ్ఆర్ దరఖాస్తులు, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, వన్యప్రాణుల సంరక్షణ, పర్యాటక అభివృద్ధి, వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని అటవీ, రెవెన్యూ సమస్యలను కేటగిరీల వారీగా విభజించి, అత్యంత ప్రాధాన్యత కలిగిన వాటిని ముందుగా పరిష్కరించాలని ఆదేశించారు. నాగుపల్లి, లచ్చగూడెం, పాల్వంచ, ఉప్పుసాక, కరకగూడెం ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను జాయింట్ సర్వే ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన బోర్‌వెల్లు, గ్రావెల్ రోడ్లు, రహదారులు, తాగునీటి పథకాలు, విద్యుత్, వైద్య సేవలు, విద్యా సదుపాయాలకు సంబంధించిన అటవీ అనుమతులను అత్యంత ప్రాధాన్యతతో మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాథమిక అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండకూడదన్నారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, గత ఏడాది సగటున 6 మీటర్లలో ఉన్న భూగర్భ జలాల మట్టం ప్రస్తుతం 9 మీటర్లకు పడిపోయిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని బోర్‌వెల్లు, మిషన్ భగీరథ, తాగునీటి పథకాల అనుమతులను అత్యసర ప్రాతిపదికన మంజూరు చేయాలని సూచించారు.

ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే గృహాలు ఉండి అదే స్థలంలో పునర్నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు అవసరమైన అటవీ అనుమతులు మంజూరు చేయాలని, కొత్తగా అటవీ భూముల్లో గృహ నిర్మాణాలను ప్రోత్సహించరాదని స్పష్టం చేశారు.

మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ కల్పించేందుకు అవసరమైన రహదారులు, విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన అనుమతులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.

పోడు వ్యవసాయానికి సంబంధించి కొత్తగా అడవులను నరికివేసి సాగు చేపట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అయితే ఎన్నో సంవత్సరాలుగా పోడు సాగు చేస్తున్న గిరిజన రైతుల సమస్యలను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

సింగరేణి ఓపెన్‌కాస్ట్ విస్తరణకు సంబంధించిన అటవీ అనుమతులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని ఆదేశించారు.

జిల్లా ఎస్ పి రోహిత్ రాజు మాట్లాడుతూ అటవీ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. అటవీశాఖ అధికారులు పోడు ప్రాంతాలకు వెళ్లే ముందు పోలీసు శాఖకు సమాచారం అందిస్తే అవసరమైన భద్రతా బలగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలతో సమన్వయం పెంపొందించుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాలోని ములకలపల్లి, దమ్మపేట, దుమ్ముగూడెం ప్రాంతాల్లో వన్యప్రాణుల వేటకు సంబంధించిన కేసులు నమోదు చేశామని తెలిపారు. వేటాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగుకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే పోలీసు శాఖకు తెలియజేయాలని కోరారు. 2017 నుంచి జిల్లాలో గంజాయి సాగుకు సంబంధించిన కేసులు నమోదు కాలేదని తెలిపారు. జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4.10 లక్షల ఎకరాల అటవీ విస్తీర్ణం ఉందని తెలిపారు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కొత్తగా అడవులను నరికివేయకుండా చర్యలు తీసుకుంటూనే పోడు వ్యవసాయానికి సంబంధించిన డివిజన్‌వారీ వివరాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఫేక్ ఆర్వోఎఫ్ఆర్ దరఖాస్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసే వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవి అంటే కేవలం చెట్లు మాత్రమే కాదని, వన్యప్రాణులు కూడా అటవీ సంపదలో భాగమని అన్నారు . సాంకేతిక పరిజ్ఞానంతో వన్యప్రాణుల సంరక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఆర్వోఎఫ్ఆర్‌కు సంబంధించిన 860 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చట్టబద్ధంగా పరిష్కరిస్తామని తెలిపారు. కిన్నెరసాని, భద్రాచలం, పర్ణశాల ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం అన్ని అటవీ అనుమతులు ఆన్‌లైన్ విధానంలోనే జారీ అవుతున్నాయని, నాలుగు నెలల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు.



అటవీ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పిస్తూ భద్రాచలంలోని "భద్రగిరి మార్ట్ " తరహాలో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడతామని అన్నారు .

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖలకు సంబంధించిన ఫారం-బి అనుమతులు సకాలంలో అందకపోవడంతో సుమారు 20 ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోడు వ్యవసాయానికి సంబంధించి సుమారు 1,800 దరఖాస్తులు అందాయని, దీర్ఘకాలంగా సాగు చేస్తున్న గిరిజన రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గుత్తికోయ హ్యాబిటేషన్లకు విద్యుదీకరణ కల్పించేందుకు అవసరమైన అటవీ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు.

భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ బూర్గంపాడు ప్రాంతంలో అటవీ--రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి జాయింట్ సర్వేను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న అటవీ--రెవెన్యూ కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అటవీ అనుమతులు, భూ సమస్యలు, అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రతిపాదనలను సమావేశంలో వివరించి, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి, జూలై 28 (అక్షరం న్యూస్):

హనుమకొండ జిల్లా భీమదేవ రపల్లి గ్రామానికి చెందిన చెల్పూరి రాజయ్య (53) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో విషాదాన్ని నింపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఇద్దరికీ వివాహాలు జరిగాయి.ఈ నెల 26వ తేదీన పనికి వెళ్లిన రాజయ్య మద్యం సేవించి రాత్రి ఇంటికి వచ్చాడు. ఈ సందర్భంగా భార్య భాగ్యలక్ష్మి మద్యం సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని మందలించడంతో మనస్తాపానికి గురైన రాజయ్య ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం వంగర రోడ్డులో మార్పాటి వీరారెడ్డి పొలం సమీపంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు.విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు రాజయ్యను ముల్కనూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు.మృతుడి భార్య చెల్పూరి భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పూసుగూడెంలో ఘనంగా 100వ 'రైతు నేస్తం'.. హాజరైన కలెక్టర్ అంకిత్

- ఆధునిక సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలను సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / ములకలపల్లి / జూలై 28 / అక్షరం న్యూస్ మండలంలోని ములకలపల్లి, పూసుగూడెం, జగన్నాథపురం రైతు వేదికల్లో మంగళవారం 100వ 'రైతు నేస్తం' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పూసుగూడెం రైతు వేదికలో నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు ప్రసారమయ్యే 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆధునిక సాగు పద్ధతులు, పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తలు అందించే విలువైన సూచనలను పాటించడంతో పాటు, తమకున్న సందేహాలను నేరుగా మాట్లాడి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి క్రమం తప్పకుండా హాజరవుతున్న ఆదర్శ రైతులు మరియు సేవలు అందిస్తున్న ఏఈఓలను ఘనంగా శాలువాలు, మెమొంటోలతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, ఉద్యానశాఖాధికారి కిషోర్, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ భరత్, పూసుగూడెం సర్పంచ్ ధర్మ, సీతారాంపురం సర్పంచ్ రవి, వీకే రామవరం సర్పంచ్ ఆదిలక్ష్మి, మండల వ్యవసాయాధికారులు అరుణ్‌బాబు, శంభో శంకర్, వ్యవసాయ విస్తరణఅధికారులు సుజాత, రాహుల్, రమేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి. ఏవో భాస్కర్



ఓదెల పెద్దపల్లి జులై 28అక్షరం న్యూస్

సూపర్ ఏలినీనో ప్రభావం వలన రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు ఈ సందర్భంగా మండలం లో నీ పోత్కపల్లి రైతు వేదిక లో విత్తన మేళా" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ, సూపర్ ఎల్ నినో ప్రభావం వలన తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడుతాయి అన్నారు. గతం లో కంటే లోటు వర్షపాతం నమోదు అవుతుంది అని తెలిపారు. తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల వలన వేసిన పంటలు కూడా భారీ గా దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. రైతు సోదరులు అధిక నీటి వినియోగ పంటల సాగు కి బదులు గా ఆరు తడి పంటలు సాగు చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం సబ్సిడీ పై కంది, పెసర, ఆముదం విత్తనాలు అందుబాటులో తీసుకొస్తుంది అన్నారు. వివరాలకు సంబంధిత ఏఈఓ నీ సంప్రదించాలి అన్నారు.కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ అంబలా సారమ్మ కొమురయ్య తోపాటు ఎరువుల దుకాణాల యజమానులు ఆకనపల్లి రమేష్ ఇరు కుల్ల శ్రీనివాస్ గొట్టే రాజేందర్ తీర్థాల శ్రీనివాస్ ఏఈఓ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- సాంకేతిక సమస్యల అధిగమించి నిర్మాణాలు పూర్తి చేయాలి.
- పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి.
- రెండో విడత నిర్మాణాలకు పక్కా ప్రణాళిక రూపొందించండి.
- సమీక్షా సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం / జూలై 28 / అక్షరం న్యూస్–: మొదటి విడత కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెంలోని క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్ కార్పొరేషన్, మండల ప్రజాపరిషత్ అధికారులతో ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో నిర్మాణాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి సొంతింటి కల నెరవేరేలా యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా రాబోయే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తుగానే పక్కా ప్రణాళికలతో సంసిద్ధంగా ఉండాలని అధికారులను కోరారు. ప్రజాధనం వృథా కాకుండా, నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ పేదలకు నాణ్యమైన ఇళ్లను అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఇతర అభివృద్ధి పనులపై దృష్టి సారించి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. సమీక్షా సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ సుజాత, చుంచుపల్లి ఎంపిడివో సుభాషిణి, లక్ష్మీదేవిపల్లి ఎంపిడివో సుస్మిత, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

•జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షురాలు దబ్బడి చంద్రకళ జిల్లా ఉపాధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్




పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జులై 28 / అక్షరం న్యూస్ -:


తెలంగాణ సాధన కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే గుర్తించి, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు దబ్బడి చంద్రకళ,జిల్లా ఉపాధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 2001 నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో తాము పడిన కష్టాలను, ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేశారు. ఆనాడు జైలు జీవితాలు గడుపుతూ, కుటుంబాలను పోషించుకోలేక, పశువులు మరియు ఇళ్లలోని మూగజీవాలు చనిపోయే దయనీయ పరిస్థితుల్లోనూ సొంత నగలు అమ్ముకొని ఉద్యమాన్ని కొనసాగించామని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యమకారులను ఆదుకుంటామని,జార్ఖండ్ రాష్ట్రం మాదిరిగా పింఛన్లు, ఇళ్లు, 250 గజాల ఇంటి స్థలాలు ఇస్తామని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి తదితరులు ఎన్నికల సమయంలో స్పష్టమైన హామీలు ఇచ్చారని వారు గుర్తుచేశారు. ఆ మేనిఫెస్టో హామీలను నమ్మి తాము కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండన్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ, ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం కేకే అధ్యక్షతన శోభన్ రెడ్డి,రాములు నాయక్,పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్ తదితరులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమే అయినప్పటికీ,ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని కోరారు.ప్రస్తుతం అనేక మంది ఉద్యమకారులు పూట గడవని దుస్థితిలో ఉన్నారని, రాబోయే పండుగల నాటికి ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు తక్షణమే గుర్తింపు కార్డులు అందజేసి,ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలోతెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండీ ఖతీజా, ఆలేటి ఎల్లమ్మ,గడ్డం లక్ష్మి. మొలుగూరి నర్సయ్య,పెర్క రాయమల్లు, ఈదునూరి శంకర్ బోసేలి శాంత, తదితరులు పాల్గొన్నారు.

## వెల్ది మోడల్ స్కూల్లో బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరణ



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూలై 28: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ ఆవరణలో ఈ నెల 30న జనగామలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ముద్రించిన వాల్ పోస్టర్లను తెలంగాణ రాష్ట్ర కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీంఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కాకాని లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రిస్టన్ కళాశాల నుంచి ఏకశిల బీఈడీ కళాశాల వరకు నిర్వహించనున్న బైక్ ర్యాలీలో ప్రతీ సీపీఎస్ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మచ్చ రాజేందర్, కందగట్ల గణేష్, మల్లం శ్రీధర్, పార్వతి,సౌజన్యప్రియ, కట్ట రాజు,దారంశ్రీను,వినీల,తుమ్మరవి. శశికుమారి,సురేఖ, వసంత మాధురి, లలిత, బాలరాజు, మారపాక రాజయ్య, ఇల్లందుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## సాదా బైనామ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి దళారుల చేతిలో మోసపోవద్దు తహసిల్దార్



ఓదెల పెద్దపల్లి జూలై 28అక్షరం న్యూస్

సాదా బైనామా పై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కొంతమంది దళారులు తహసిల్దార్ సంతకాలను సోర్జరీ చేసి పనులు చేపించేందుకు ప్రయత్నం చేస్తున్నారని 13 బీసీ ఫారాలను కూడా డూప్లికేట్ తీసుకొని వచ్చి పనులు చేయించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని కొన్ని దరఖాస్తులు మా దృష్టికి వచ్చాయని తాసిల్దార్ బి వనజా నాయక్ తెలిపారు మంగళవారం మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాదా బైనామా వాటిపై ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని ఏ సమస్య వచ్చినా నేరుగా తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు అదేవిధంగా చాలామంది దళారుల చేతిలో మోసపోతున్న సంగతి మా దృష్టికి వచ్చిందని అలాంటి వ్యక్తులను కార్యాలయంలోకి అనుమతించబోమని అలాంటి వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు ప్రజలంతా అప్రమత్తంగా ఉండి దళారుల చేతిలో మోసపోవద్దు అని తహసిల్దార్ విజ్ఞప్తి చేశారు

## ఆశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి సాగు నీరు విడుదల

జనగామ జిల్లా/రఘునాధపల్లి/( అక్షరం న్యూస్)జూలై 28: స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో రైతుల కోరిక మేరకు మండలంలోని ఆశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి కాంగ్రెస్ నాయకులు మంగళవారం సాగు నీరును విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే కడియంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నామాల బుచ్చయ్య, మాజీ సర్పంచ్ తూముకుంట్ల సురేందర్ రెడ్డి, పొన్నగంటి రాజు, జూలూరి వేణు, మల్లారెడ్డి, పరుశరాములు, స్వామినాథ్, యాకుబ్, శ్రీనివాస్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.131 కోట్ల విలువైన వైద్య సేవలు

•ప్రైవేట్ ఆసుపత్రికి దీటుగా అన్ని సదుపాయాలతో ప్రభుత్వ వైద్యం.
•రెండేళ్లలో 2,081 ఆర్థో సర్జరీలు, 5,067 ప్రసవాలు.
•రూ.52 కోట్లతో 100 పడకల ఆసుపత్రిగా విస్తరణ.
•ప్రభుత్వ విప్ విజయరమణరావు.



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూలై 28 / అక్షరం న్యూస్ -:

పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండేళ్లలో రూ.131.62 కోట్ల విలువైన వైద్య సేవలు అందించామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు తెలిపారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసుపత్రిలో వైద్య సేవలను గణనీయంగా మెరుగుపరిచామని చెప్పారు. రూ.40 లక్షలతో కంటి, దంత, ఆర్థో, ఈఎన్‌టీ, చర్మవ్యాధులు తదితర విభాగాలకు అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. నవజాత శిశువుల సంరక్షణ కోసం ప్రత్యేక ఎస్ఎన్‌సీయూను ఏర్పాటు చేసి వార్మర్లు, ఫోటోథెరపీ యూనిట్లు, సీప్యాప్, వెంటిలేటర్ వంటి పరికరాలను సమకూర్చామని పేర్కొన్నారు. గత రెండేళ్లలో 2,081 ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు, 6,478 జనరల్ సర్జరీలు, 3,096 కంటి శుక్లాల ఆపరేషన్లు, 216 దంత శస్త్రచికిత్సలు నిర్వహించామని తెలిపారు. 40,923 అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు, 2,355 ఈకో పరీక్షలు, 32 వేలకుపైగా ఈసీజీ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఇదే కాలంలో 5,067 ప్రసవాలు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఓపీ సేవల ద్వారా 5.12 లక్షల మందికి పైగా రోగులకు ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, అధిక సంఖ్యలో రోగులు వైద్య సేవల కోసం ప్రభుత్వ దవాఖానను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో జిల్లా ఆసుపత్రిని రూ.52 కోట్ల వ్యయంతో 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా విస్తరిస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం వచ్చే ఏడాది ప్రారంభంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. తెలంగాణలోని 33 జిల్లా ఆసుపత్రుల్లో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అగ్రస్థానంలో నిలవడానికి కృషి చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీదర్, వైద్యులు, సిబ్బంది, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నూగిల్ల మల్లయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీదర్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్, ఈ-రోల్ మ్యాపింగ్ పురోగతిపై రాజకీయ పార్టీల తో తహసిల్దార్ సమావేశం



ఓదెల పెద్దపల్లి జూలై 28అక్షరం న్యూస్

రాబోయే ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం అలాగే ఈ-రోల్ మ్యాపింగ్ పురోగతి మెరుగుదల లక్ష్యంగా ఓదెల మండల స్థాయి రాజకీయ పార్టీల సమావేశాన్ని తహసిల్దార్ బి వనజా నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రేషనలైజేషన్ ఓటరు జాబితా సవరణ, ఈ-రోల్ మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లుగా చెప్పారు. ఈ సందర్భంగా తాసీల్దార్ బి వనజ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో ముఖ్యమని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు

## భీమదేవరపల్లి మండలంలో రీసర్వేపై అవగాహన సదస్సులు

• తహశీల్దారు రాజేష్..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 28/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లాభీమదేవరపల్లి మండలంలోని ఆరు రెవెన్యూ గ్రామాలను రీసర్వే కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు తహశీల్దారు రాజేష్ తెలిపారు. ఈ మేరకు రైతులు, భూ యజమానులకు రీసర్వే ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గ్రామాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.సదస్సుల షెడ్యూల్ ప్రకారం జూలై 28న ముత్తారం, 29న భీమదేవరపల్లి, 30న రత్నగిరి, 31న మాణిక్యాపూర్, ఆగస్టు 1న కొప్పూర్, 2న ముస్తఫాపూర్ గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.రైతులు, భూ యజమానులు సంబంధిత పత్రాలతో సదస్సులకు హాజరై రీసర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన పొందాలని తహసీల్దార్ రాజేష్ కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## రహదారి మౌలిక వసతుల బలోపేతానికి కేంద్ర కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం

•వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జులై 28:

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కీలక రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పాటు జాతీయ రహదారిపై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని కరుణాపురం నుండి పెద్ద పెండ్యాల, నర్సింగరావుపల్లి, ఎలుకుర్తి, ధర్మసాగర్ మండల హెడ్‌క్వార్టర్, దేవునూర్, సోమ దేవరపల్లి, దామెర, ఎల్కతుర్తి మండల హెడ్‌క్వార్టర్ వరకు ఉన్న రోడ్డును విస్తరించి బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఈ రోడ్డు హైదరాబాద్ నుండి కరీంనగర్, సిద్ధి పేటకు వెళ్లే వాహనాలు వరంగల్ వెళ్లే అవసరం లేకుండా 163, 563 జాతీయ రహదారులను అనుసంధానించే కీలక మార్గమని, వేలాది మంది ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలు నిత్యం వినియోగిస్తున్నారని వివరించారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.అలాగే యాదాద్రి--వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163) నాలుగు లైన్ల విస్తరణ సమయంలో పలు గ్రామాల్లో నిర్మించిన సర్వీస్ రోడ్ల మధ్య మిగిలిపోయిన లింకులను పూర్తి చేయాలని కోరారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, ఘన్‌పూర్ స్టేషన్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు ఉన్నప్పటికీ వాటి మధ్య అనుసంధానం లేకపోవడంతో స్థానిక ప్రజలు ప్రధాన రహదారినే వినియోగించాల్సి వస్తోందని తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని వివరించారు. అవసరమైన భూమి ఇప్పటికే సేకరించిన నేపథ్యంలో మిగిలిన లింకుల నిర్మాణానికి వెంటనే ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక అవసరాలకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన ఆమోదం తెలపాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. వినతులను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు

## టూర్స్ అండ్ ట్రావెల్స్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు మొక్కులు

జనగామ జిల్లా /?రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూలై 28 :

రఘునాథపల్లి టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో మంగళవారం రఘునాథపల్లి గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుని, పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో ట్రావెల్స్ సభ్యులంతా పాల్గొని దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.?ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులు వై. కుమార్ గౌడ్, లీగల్ అడ్వైజర్ కొయ్యడ మల్లేష్ లు ముఖ్య అతిథులుగా హాజరై, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.?ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి టూర్స్ అండ్ ట్రావెల్స్ అధ్యక్షుడు



పెంతల సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎండి. రంజాన్, అమృతం కుమార్, ప్రధాన కార్యదర్శి రేసు కుమార్, కార్యదర్శి నాసగోని సుమన్ పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు కూరపాటి సుధాకర్, ఎస్కే. ఇంతియాజ్, బాల్నే నాగరాజు, పుప్పాల రవి, పెండ్లి రంజిత్, షాహిద్ పాషా, కొయ్యల యాదగిరి, బుంగాని సురేష్, దర్గా స్వామి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉత్తమ కథ రచయిత పురస్కార గ్రహీత సొత్కు రత్న జానకి



మంచిర్యాల జిల్లా/మందమర్రి/ జులై 28/ అక్షరం న్యూస్ –:
తెలుగు సాహితీవనం సంస్థ 9 వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కథల పోటీలలో మందమర్రి పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత సోత్కు రత్న జానకి రాసిన కథ ఉత్తమ కథ పురస్కారానికి ఎంపికయింది. ఈకార్యక్రమానికి అతిథులుగా తెలంగాణ భాషాసాంస్కృతిక సంచాలకులు,ఐ ఎ ఎస్ అధికారి డా.ఏనుగు నరసింహారెడ్డి, డా.అంపశయ్య నవీన్, డా.పెద్దింటి అశోక్, డా.ఎస్ చంద్రయ్య,స్త్రీ వాద రచయిత్రి ఓల్గా, టివి, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, సీనియర్ జర్నలిస్టు సత్యాజీ, తోట అరుణ, తంగెళ్ళ శ్రీదేవి, తెలుగు సాహితీ వనం సంస్థ అధ్యక్షురాలు శాంతికృష్ణ ల చేతులమీదుగా ఘన సత్కారం పొందారు.ఈ సందర్భంగా సొత్కు రత్న జానకి మాట్లాడుతూ నేను రచించిన కథా సంపుటి కి బహుమతి రావడం ఉత్తమ కథ పురస్కారానికి ఎంపికయినందుకు తెలుగుసాహితీ వనం సంస్థ అధ్యక్షురాలు శాంతికృష్ణకి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## మృతి చెందిన నిడిగొండ ఉప సర్పంచ్ కుటుంబానికి అండగా నిలిచిన ఉప సర్పంచ్ ల ఫోరం



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూలై 28: మండలంలోని నిడిగొండ ఉప సర్పంచ్ గంగిడి లక్ష్మారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే.. జిల్లా, మండల ఉప సర్పంచ్ ల ఫోరం ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డి కుటుంబానికి మంగళవారం ఆర్థిక సహాయం అందజేసి.. అన్ని వేళాల అండగా ఉంటామని జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరం నాయకులు లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు పండుగ హరీష్, మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ఎడ్ల బాలరాజు, కృష్ణారెడ్డి, నాగపూరి కిషన్, సరిత, మాధవ్, సంపత్ రెడ్డి, చిలువేరు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బోర్ ప్రారంభం



మంచిర్యాల జిల్లా మందమర్రి జూలై 28/అక్షరం న్యూస్ –:
తెలంగాణ కార్మిక శాఖ మంత్రివర్యులు చెన్నూరు శాసనసభ్యులు డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మందమర్రి పట్టణ రైల్వే స్టేషన్ రోడ్డులో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బోర్ మంజూరు చేసి పనులను ప్రారంభించారు. భక్తుల అవసరాల దృశ్య ఆ యొక్క ఆలయ కమిటీ సభ్యులు నీళ్ల బోర్ కావాలని అడగగా మాజీ పీసీసీ సభ్యులు గుడ్ల రమేష్ ప్రత్యేక చొరవతో బోరు వేసారు. ఈకార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్, మాజీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నెరవట్ల శ్రీనివాస్, పట్టణ మహిళా అధ్యక్షులు గడ్డం రజిని, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా, మైనారిటీ నాయకులు ఎం.డి ఇషాక్, విజయ్, రామకృష్ణ, బోగి వెంకటేశ్వర్లు, అన్నం మదనయ్య, శనిగారపు చంద్రయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, సాత్విక్, రుత్విక్ లు పాల్గొన్నారు. ఆలయ సభ్యులు స్థానిక ప్రజానీకం బోరు వేయడంతో మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఆడిట్



మంచిర్యాల జిల్లా /మందమర్రి/ జూలై 28/ అక్షరం న్యూస్ –:
కాసిపేట మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ ప్రతినిధి స్వరూప్ పాఠశాల నిర్వహణ, నిర్వహణ రికార్డులు, విద్యా సంబంధిత అంశాలను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. పాఠశాలలో రికార్డుల నిర్వహణను క్రమబద్ధంగా చేపట్టినందుకు, ఉపాధ్యాయులను అభినందించారు. తల్లిదండ్రులతో, విద్యార్థులతో వ్యక్తిగతంగా మాట్లాడి పాఠశాలకు సంబంధించిన వివరాలను సేకరించినారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర స్వామి, ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణగోపాల్, చంద్రశేఖర్ రెడ్డి, మామిడి తిరుపతి, జ్యోతి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## వంగరలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

• అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి: సర్పంచ్ గజ్జల సృజన రమేష్..




హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై28/అక్షరం న్యూస్:–
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను మంగళవారం గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆడబిడ్డల వివాహ సమయంలో తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడంలో కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ తరఫున ప్రతి అర్హ లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఉపసర్పంచ్ మారం సతీష్, గజ్జల రమేష్, జీపీఓ సంపత్, లబ్ధిదారులు మంచాల మంజుల, గుండాల రాజమణి, వేల్పుల సరితతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పరిష్కారం

•13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి
•విజయ సీతారాములు



ఖమ్మం జిల్లా/వైరా టౌన్ జూలై 28 (అక్షరం న్యూస్)
వైరా మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డు ఎంట్రన్స్ లో బాలికల గురుకుల పాఠశాల ,
ట్రెజరీ కార్యాలయం, వెటర్నరీ ఆఫీసు మొదలైగు గవర్నమెంట్ కార్యాలయాలతో పాటు నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే పెట్రోల్ బంక్ పక్కన రోడ్డు తరచూ వర్షం వచ్చిన ప్రతిసారి నేషనల్ హైవే రోడ్డుకి 13వ వార్డులోకి వెళ్లే సిమెంట్ రోడ్డుకి మధ్య గ్యాప్ వచ్చి నీళ్లు ఆగి ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు ఇబ్బంది పడుతూ వార్డ్ కౌన్సిలర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకొని రాగా మున్సిపాలిటీ సిబ్బందితో మాట్లాడి దగ్గర్లో ఉన్న మట్టిని తీసుకువచ్చి దానిని మొత్తం మట్టితో నింపి వార్డు ప్రజల , ఉద్యోగుల అసౌకర్యాన్ని తీర్చుతున్న వైరా మునిసిపాలిటీ తొలి వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు

## ఎన్టిపిసి వద్ద రాజీవ్ రహదారిపై అదుపు తప్పిన లారీ



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
ఎన్టిపిసి ఎఫ్ సి ఐ క్రాస్ రోడ్ రాజీవ్ రహదారి పై బొగ్గులోడుతో అతివేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి డివైడర్ పై కి దూసుక వెళ్లిన సంఘటనతో భారీ ప్రమాదం తప్పింది. మంగళవారం సాయంత్రం 7:30 గంటల కు ఈ సంఘటన జరిగిందని ట్రాఫిక్ ఎస్ఐ రాజేశ్వరరావు తెలిపారు. గోదావరిఖని నుండి బొగ్గు లోడ్ తో వస్తున్న లారీ ఎఫ్ పి ఐ క్రాస్ రోడ్ వద్ద రెడ్ సిగ్నల్ పడడంతో వేగంగా వస్తున్న లారీ బ్రేకులు పని చేయకపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా డివైడర్ పైకి ఎక్కించాడు దీంతో భారి ప్రమాదం తప్పింది. సిగ్నల్స్ పడడంతో అప్పటికే లారికి ఎదురుగా వరుసగా మూడు కార్లు ఆగి ఉన్నాయని అన్నారు, లారీ డ్రైవర్ డివైడర్ పైకి తీసుకోవడంతో భారి ప్రమాదం తప్పని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు లారీని తొలగించి తగిన చర్యలు చేపట్టారు.



## నేరాల ఛేదనలో మరింత కీలకమైన భాధ్యతలు నిర్వర్తించాలి: పోలీస్ కమిషనర్






ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ జూలై 28 (అక్షరం న్యూస్)
నేరాల గుర్తింపు విషయంలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ మరింత సమర్థవంతంగా పని చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. మంగళవారం నగరంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్..నేరాలు, దొంగతనాలు, దోపిడీలు తదితరాలను గుర్తించడంలో దర్యాప్తు అధికారులకు అందిస్తున్న సహాయాన్ని, పాత నేరస్థుల కదలికలకు సంబంధించి ముందస్తు సమాచార సేకరణలో సీసీఎస్ పోలీసుల పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ… నేరాల ఛేదనలో కీలకంగా వ్యవహరించే సీసీఎస్‌ను పటిష్ఠ పరిచేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. అంతేకాక ప్రాపర్టీ రికవరీపై సీసీఎస్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ రకాలైన నేరాల అదుపునకు అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తు వేగవంతం చేయడానికి క్రైమ్ బృందాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలాని ఆదేశించారు.


## కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో రేవంత్ రెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి, తదితరుల భేటీ



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ జూలై 28 (అక్షరం న్యూస్)
ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, తదితర ఎంపీలతో కలిసి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు.
గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. ఈసారి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు 'ప్రధాని ఆవాస్ యోజన – గ్రామీణ్' (గ్రాహీహ్–+) 2.0 కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ (ఎదీ–+ =ూవీ–+) జాబితాలో చేర్చి, దానిద్వారా లబ్ధిదారులకు 90 రోజుల పాటు పని కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల వల్ల దెబ్బతింటున్న గ్రామీణ కుటుంబాలను, రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం పరిధిని విస్తరించాలని రేవంత్ రెడ్డి కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణాలతో పాటు భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులను ఈ పథకం కింద అనుమతించాలని కోరారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులను కూడా ఇందులో చేర్చి, రైతాంగానికి, గ్రామీణ ఉపాధి రంగానికి కేంద్రం తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు.

## తల్లాడ వీడిసీ చైర్మన్ గా రెడ్డెం రామకృష్ణారెడ్డి

• సన్మానించిన మండలాధికారులు, పంచాయతీ పాలకవర్గం



ఖమ్మం జిల్లా/తల్లాడ టౌన్ జూలై 28 (అక్షరం న్యూస్)
తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా నారాయణపురం గ్రామానికి చెందిన రెడ్డెం రామకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను తల్లాడ మండల అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం సన్మానించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి)తో పాటు ఎంపీడీవో శ్రీధర్ రాజు పలువురు అధికారులు, వార్డు మెంబర్లు శాలువాలతో సన్మానించి సత్కరించారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయితీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని,
ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, ఈవో హరికృష్ణ, వార్డు సభ్యులు సరికొండ శ్రీనివాసరాజు, కమాల్, దోనెజ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానితో ముఖాముఖీలో యస్.బి.ఐ.టి. విద్యార్థులు



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ జూలై 28( అక్షరం న్యూస్)

స్వర్ణ భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (యస్.బి.ఐ.టి.) ఖమ్మం విద్యార్థులు మరోసారి విశిష్టమైన గుర్తింపు పొందారు. వికసిత్ భారత్-2047 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మై భారత్ కార్యక్రమం ద్వారా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ముఖాముఖి సంభాషించే అరుదైన అవకాశానికి ఖమ్మం జిల్లా తరఫున యస్.బి.ఐ.టి.కి చెందిన 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ అరుదైన అవకాశం విద్యార్థులకు దేశ నిర్మాణంలో యువత పాత్ర, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలు, భారతదేశ అభివృద్ధి దిశగా తమ ఆలోచనలను పంచుకునే గొప్ప వేదికగా నిలిచింది. ఖమ్మం జిల్లా తరఫున ఎంపిక కావడం యస్.బి.ఐ.టి.కి ఎంతో గర్వకారణమని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా" జి. ధాత్రి విద్యార్థులను అభినందిస్తూ, విద్యార్థులు విద్యలోనే కాకుండా సహపాఠ్య, సామాజిక సేవ, నాయకత్వం, జాతీయ స్థాయి కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని కళాశాల ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందన్నారు. ఇటువంటి అవకాశాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, దేశాభివృద్ధికి తమ వంతు బాధ్యతను గుర్తించేలా చేస్తాయని పేర్కొన్నారు.యస్.బి.ఐ.టి. సంస్థ నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమలతో అనుసంధానం, విలువల ఆధారిత విద్య , సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, దేశానికి సేవ చేసే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డా" జి. రాజ్‌కుమార్ అభినందించి తమ విద్యార్థులకు ఈ సదవకాశాన్నిచ్చిన ఖమ్మం కలెక్టర్ దివాకర, జిల్లా యువ అధికారి యమ్. వెంకట్ రాంబాబు కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా" ఎ.వి.వి. శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుకు రైతులు ముందుకు రావాలి

- విత్తన మేళాలో వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ పిలుపు.



రామగిరి,పెద్దపల్లి జిల్లా,జూలై 28(అక్షరం న్యూస్)

రామగిరి మండలంలోని సుందిళ్ల రైతు వేదికలో మంగళవారం ఆరుతడి పంటలకు సంబంధించిన విత్తన మేళాను నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా కంది, ఆముదం, వివిధ కూరగాయల విత్తనాలను ప్రదర్శించి రైతులకు సాగు విధానాలపై అవగాహన కల్పించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున సాగు కాని భూముల్లో కంది పంటను సబ్సిడీపై సాగు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే ఆముదం సాగు చేసే రైతులకు ఉచితంగా విత్తనాలు అందించడంతో పాటు, కంపెనీ ద్వారా బైబ్యాక్ (పంట కొనుగోలు) సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు వివరించారు.కావున కంది, ఆముదం పంటలు సాగు చేయాలనుకునే రైతులు తమ సమీప వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుందిళ్ల సర్పంచ్ ముసుకుల నరేందర్ రెడ్డి, జల్లారం సర్పంచ్ కొండా మంజుల, వ్యవసాయ విస్తరణ అధికారులు మౌనిక, రమేష్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# జలసిరి కార్యక్రమంలో మొక్కల పంపిణీ

- నీటి సంరక్షణపై అవగాహన

రామగిరి, పెద్దపల్లి జిల్లా, జూలై 28 (అక్షరం న్యూస్):

రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో గ్రామస్థులకు పూల మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించడం తమ బాధ్యతగా భావించాలని సూచించారు. అలాగే ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, వర్షపు నీటి సద్వినియోగం, సహజ వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కస్ప మహేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ కొమురయ్య, గ్రామ కార్యదర్శి ప్రదీప్, వార్డు సభ్యులు కొట్టే నాగరాజు, రేండ్ల కుమారస్వామి, గోనె రాము, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# సామాజిక సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం





- లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ కాపా మురళి కృష్ణ
- విప్పలమడకకు ఫ్రీజర్ బాక్స్ వితరణ ..
- చేతిపంపు ప్రారంభోత్సవం బ్యాగ్స్ పంపిణీ ..

ఖమ్మం జిల్లా/వైరా టౌన్ జూలై 28 (అక్షరం న్యూస్)

సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే వైరా లయన్స్ క్లబ్ లక్ష్యమని ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్, కాంగ్రెస్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాపా మురళికృష్ణ అన్నారు. వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కాపా మురళీకృష్ణ జన్మదినం సందర్భంగా వైరా మండలంలోని విప్పలమడక గ్రామానికి మంగళవారం ఫ్రీజర్ బాక్స్ ను ఉచితంగా ఇచ్చారు. అదేవిధంగా విప్పలమడక గ్రామంలోని ఎస్సీ స్మశాన వాటికలో ఏర్పాటుచేసిన చేతిపంపును, ఫ్రీజర్ బాక్స్ భద్రపరిచేందుకు నిర్మించిన గదిని కాపా మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడా సంపత్ అధ్యక్షతన జరిగిన సభలో కాపా మురళీకృష్ణ ప్రసంగించారు. వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విప్పలమడక గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవతోనే మానవక జన్మకు సార్ధకత లభిస్తుందని చెప్పారు. తన జన్మదినం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. మేడా శంకరయ్య - సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విప్పలమడకలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుగా గ్రామంలోని సిఎస్ఐ చర్చిలో మురళీకృష్ణ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి గ్రామస్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామస్తులు మురళీకృష్ణకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు అనంతరం బీసీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు పిల్లలకు బ్యాగ్స్ అందించారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా జిఈటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు, ఎల్సిఎఫ్ఐ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు, జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్, రీజనల్ సెక్రెటరీ వై బుచ్చిరామారావు, రీజియన్ చైర్మన్ నూకల శ్రీనివాసరావు వైరాకుల అధ్యక్షులు కొల్లా రాంబాబు జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావు విప్పలమడక మాజీ సర్పంచ్లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జానుపాపయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, సోమలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వీరపనేని చెన్నకేశవరావు, ఉప సర్పంచ్ బూర్గు లూర్దమ్మా, న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భుమేశ్వరరావు, గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు, కాంగ్రెస్ గ్రామ అధ్యకుడు కొల్లికొండ వీరభద్రరావు, లయన్స్ క్లబ్ సభ్యులు చింతోజు నాగేశ్వరరావు,ఎపూరి రాజారావు చింతలపూడి వెంకటేశ్వరరావు, ఉయ్యూరు రామకృష్ణ, గంగవరపు కిషన్, పువ్వాడ రాము, వార్డు సభ్యులు ముత్తమాల నాగజ్యోతి, పారుపల్లి నిఖిత, ముత్తమాల దేవానందం, కాశిమాల సామేలు, బూర్గు నందిని, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.











# రిటైర్డ్ సీఐ సి.హెచ్. బాబురావుకు



- విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఘన నివాళి
- కుటుంబానికి ?25 వేల ఆర్థిక సహాయం అందజేత

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ జూలై 28 (అక్షరం న్యూస్)

రిటైర్డ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. బాబురావు అకాల మరణం పట్ల విశ్రాంత పోలీసు అధికారుల సంఘం సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన భౌతిక దేహానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.సంఘం నాయకులు మాట్లాడుతూ, పోలీసు శాఖలో శ్రీ బాబురావు నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజాసేవా దృక్పథంతో విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన మరణం పోలీసు కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.మృతుని కుటుంబానికి అండగా నిలుస్తూ,విశ్రాంత పోలీసు అధికారుల సంఘం తరఫున ?25,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ఎల్లప్పుడూ పోలీసు కుటుంబాల సంక్షేమానికి అండగా ఉంటుందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే వైరా, రాములు నాయక్, ప్రధాన కార్యదర్శి రుద్ర వెంకటనారాయణ, కోశాధికారి కే. సోమయ్య, విశ్రాంత సీఐలు జె. నరసింహారెడ్డి, వై. సుధాకర్, నాగయ్య, బత్తుల నాగేశ్వరరావు, సంజీవరావు, కే. నరసింహారావు, బి డి కె రత్నం,కే. శివాజీ, కోటేశ్వరరావు, ప్రభుదాస్ సి.హెచ్. రంగారావు,తో పాటు సంఘ కార్యవర్గ సభ్యులు మరియు పలువురు విశ్రాంత పోలీసు అధికారులు పాల్గొని శ్రీ బాబురావుకు ఘనంగా నివాళు లర్పించారు.



Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609